శిలువ వేసిన మనుషులు

యెంతటి హిందూ పతివ్రత పేర వెలసినా, వూరికి వెలిగా అరుంధతీయవాడ. తగిన సతిని పొందాలని వెదుకుతూ అరుంధతిని పరీక్షించటానికి వచ్చిన వశిష్ఠుని జుట్టులా, గడ్డంలా జీబుగా అడ్డదిడ్డంగా పెరిగిన చీకిచెట్లు. చీకిచెట్ల మధ్య 'మాదిగిండ్లు'

స్వచ్ఛమైన పాలపొడి ఆరబోసినట్లున్న వెన్నెల్లో. ఆ పెద్ద చీకిచెట్ల నీడ పడుతోంటే ఆ కొట్టం - దాని రాతి గోడలు పదిలంగానే వున్నాయి; దగ్గర రాళ్ళగనులున్నాయి కాబట్టి. అడవులు దగ్గర్లోలేవు కాబట్టి కొట్టం మీద బోద నిండుగానూ లేదు; మెండుగానూ లేదు. కాయ కష్టంతో బిరుసెక్కిన నల్లని శరీరంమీద కుళ్ళమాపిన యెఱ్ఱ చిరుగుల చీరలా వుంది బోద.

ఆ కొట్టం గంగిది. రాళ్ళదొడ్డిలో పాలీషు రాళ్ళు రుద్దుతుందే ఆ గంగిది. కొట్టంలో గుడ్డిదీపం ముందు గంగి కంటిదీపం క్రరెం కడు. ప్రభుత్వం ప్రచురించిన మూడవ తరగతి తెలుగువాచకంలో తలదూర్చి. "పుష్టికరమైన ఆహారము" అనే పాఠాన్ని వల్లిస్తున్నాడు.

వాడికి తొమ్మిదేళ్ళుంటాయి. గనిలోంచి గట్టున విసిరేసిన నాసిరకం నల్ల కంచురాతి ముక్కలా వుంటాడు.

సగం ముద్ద చద్దిసంగటినీ, వేలుగుండంత వూరిమిండినీ రక రకాల అవతారాలున్న దేవునిలాంటి సత్తుపల్లెంలో పెట్టి, "పొద్దు పోయింది సదివింది సాల్లే బువ్వ తిని పడుకో" అంది గంగి. పళ్ళెంలోని బువ్వను కళ్ళెత్తి కర్రెంకడు చూశాడు. పాఠంలోని 'శక్తిని యిచ్చునవి' 'పుష్టిని యిచ్చునవి' 'రక్షణ యిచ్చునవి' 'ధాన్యములు, దుంపకూరలు, అరటిపండ్లు, చెక్కెర, బెల్లము, నెయ్యి, నూనె;' 'పాలు, గ్రుడ్లు, మాంసము'; 'పండ్లు, ఆకు కూరలు, వుప్పు' పళ్లెంలో కన్పించలేదు. యీ మాయ యెవరిదో వాడికర్థం కాలేదు. వాడు వాళ్ళమ్మను అడిగాడు:

"అమ్మా యీ పాటంలో సూడు 'శక్తిని, పుష్టిని, రక్షణను యిచ్చు వస్తువులను కలిపి తినవలెను' అని రాసినారు. పుష్టికర మైన ఆహారం మనకెందుకు లేదు?"

వెంకడి ప్రశ్న అర్థంకాక గంగి తెల్లబోయింది. తేరుకొని కొడుకు తెలివి తేటలకు మురిసిపోయింది. కొడుకు ప్రక్కన చతికిల బడి, నోరు తిరక్క అవస్థపడుతూ అడిగింది:

"పుట్టికరమైన ఆకారమంటే, అదేందిరా?"

"పుట్టికరమైన అకారంకాదు. పుష్టికరమైన ఆహారము" గర్వంగా వాళ్ళ టీచరు హనుమంతు పోజులో వెంకడన్నాడు.

గంగి, కొడుకు పలికినట్లు పలకాలనుకొని పెదాలు కదిపి చూసింది కాని సాధ్యం కాలేదు. గంగికి చేతుల కష్టం తెలుసుగాని కేవలం పెదాల కష్టం తెలియదు. సిగ్గుపడుతూ అడిగింది:

"అదంటే యేందిరా?"

"అంటే.... అంటే....సెప్తా వుండు. యీ బొమ్మ సూడు."

"కూరగాయల బొమ్మ."

"రైటు" వెంకడు పాలోచనగా పేజీ తిప్పి, వుత్సాహంతో చదివాడు-బొమ్మలలో వున్న యిద్దరు పిల్లలను చూపిస్తూ:

'ఒకడు యిందాకా చూచిన యెలుకవలె చిక్కి వున్నాడు. మరొకడు ఒక మాదిరిగా వున్నాడు. నిజమే కాని మీరు రెండు బొమ్మలను వేరు వేరు పిల్లలనుకొనుచున్నారు. అది నిజముకాదు. రెండునూ ఒకే పిల్లవానివి. మొదటిది వానికి మంచి పోషణ లేనప్పుడు తీసినది. రెండవది వానికి మూడునెలలు పుష్టికరమైన ఆహారం పెట్టిన తర్వాత తీసినది.'

"తెలిసిందా?"

గంగి బొమ్మలోని యెలుకవలె వుండే పిల్లవాని వైపు చూసింది. కొడుకును చూసింది. ప్రక్కన్నే అల్లంత దూరంలో చింకి యీతచాప మీద పడుకొని నిద్రలోకూడ అవస్థపడుతున్న రోగిష్ఠి నాలుగేళ్ళ కూతురును చూసింది. గంగి మనసు వికలమైపోయింది. ఆవిడ కడుపులో యెవరో రాక్షసంగా దేవినట్లుంది; ఆవిడ గుండెల్లో

యెవరో పాశవికంగా శూలాలు గుచ్చినట్లయింది. యెవరిమీద కోపమో తనకే అర్థంగాక కొడుకును కసిరింది:

"తిండి తిన్రా ముందు సచ్చినోడబట్టా. నీ పాటాలు ముండ మొయ్యా!"

యెలాంటి పాఠాలైనా ముండమొయ్యవు. మనుషుల్లో ఆడవాళ్ళే ముండమోస్తారు. గంగి ముండమోసి నాలుగేళ్లు కావచ్చింది. రాళ్ళగనిలో పనిచేసే మొగుడు, గనిలో నాలుగంగుళాల మందం బండలు లారీకి యెత్తుతున్నప్పుడు బండజారి మీదపడి చస్తే ముండ మోసింది.

కొత్తగా పెళ్ళయిన రోజులూ. ఆ రోజుల్లోని చిన్న చిన్న సంబరాలు. చెట్టంత మొగుడి చావూ. గని వోనర్లు మొగుడి ప్రాణానికి కొసరి కొసరి, గొణిగి గొణిగి, తూకంవేసి యిచ్చిన రెండు వందల రూపాయలూ. యెదిగొస్తున్న కొడుకూ. యేదగలేక చావలేక మొగుడ్నీ, తన్నూ చంపేందుకే పుట్టిన రోగిష్టి దయ్యపు పిల్లా. రోజూ ప్రొద్దున లేచినప్పటినుంచీ ప్రొద్దుపోయేదాకా చేతులరిగినా, నడుం విరిగినా, కాటుక మెరిసేటట్లు కూలి డబ్బులకోసం రుద్దవలసిన పాలీషు రాళ్ళూ. చాలీ చాలని తిండీ. కొడుకు భవిష్యత్తూ యేవేవో జ్ఞాపకానికి వచ్చి, గంగి రోగిష్టి కూతురు దగ్గర కూచొని దాన్ని వెర్రిగా చూస్తోంది.

అమ్మ యెందుకు కసిరిందో పెంకడికి అర్థం కాలేదు. అమ్మకు కోపం యెక్కువని వాడనుకున్నాడు. సత్తుపళ్ళెంలోని సద్ది

సంగటిని గబగబా మింగి, చెల్లెలు వోబి పక్క ముడుక్కున్నాడు. అలికిడికి ఆ పిల్ల కదిలింది. చెల్లెల్ని యెగాదిగా చూస్తేనే వాడి చైత న్యం మేలుకొంది.

వోబి నిజంగా యెలుకే. పాఠంలోని యెలుకే కాళ్ళు బోద పుల్లల్లా వుంటాయి. కడుపు బానలా వుంటుంది. నోరు మాత్రం పెద్దది. దానికి పుష్టికరమైన ఆహారంలేదు. వుంటే బాగుండేది. యెం దుకులేదో? వూళ్లోని పెద్ద రెడ్ల పిల్లలు బాగుంటారు. కోమటోళ్ళ పిల్లలు అంత వూరివుంటారు. మాలవాడలోని ఫాదరీ పిల్లలు-డేవిడ్ గాడూ-బాగుంటారు. వాళ్ళేం తింటారో! పాఠంలో చెప్పినవన్నీ తింటారేమో! తమకేమో పొద్దున యిన్ని గంజినీళ్ళు. పైటాల యింత సంగటీ, రాత్రి సద్ది సంగటో, కొర్రకూడో! యెప్పుడన్నా నీళ్ళ మజ్జిగ, పాలూ, గుడ్లూ, మాంసమూ, పండ్లూ, నెయ్యీ, నూనె యేవీ వుండవు. వుప్పూ, మెరపకాయా, యెర్రగడ్డా తిని చావాలి.

వెంకడికి తమ పరిస్థితిమీద కోపం ముంచుకొచ్చింది. దుఃఖం వచ్చింది. ఆ ఆలసటలోనే వాడా రాత్రి నిద్రపోయాడు. గంగి పస్తు పడుకొని ఆ రాత్రంతా కుళ్ళుకొంది.

మరుసటి రోజేదో శెలవు కాబట్టి పిల్లలు కొంతమంది వూరికే మాదిగిండ్లకు మధ్య వుండే చింతవనంలో ఆడుకుంటున్నారు. సమితి ప్రెసిడెంటుకొడుకు శంకరరెడ్డి. ముక్కుసెట్టి కొడుకు కొండిసెట్టి ఫాదర్ కొడుకు డేవిడ్, కర్రెంకడూ కలిసి వేలిగుండ్లాట ఆడుతు న్నారు. ఆటలో కొండిసెట్టి యెక్కువ సార్లు ఓడినా, లంచం పెట్ట

డంలో పెద్దచేయి కాబట్టి. దోకటం బాధ తప్పించుకున్నాడు. అటలో యెవ్వరోడినా మిగతా మిత్రులకు లంచమివ్వాలి. మామూలుగా యే లంచమూ యివ్వలేని క్రెంకడు దాతలకు యేజంటుగా వ్యవహరిస్తూ నిత్యం దాతల తరుపున ఆటలో దోకాలి.

ఆబృందానికి కొండిసెట్టి బంగారు బాతు. రోజూ తినటానికి అవో యివో తెచ్చి యిస్తాడు. లేదా అంగట్లో కొత్తగా తయారయిన తిను బండారాల సమాచారం చెప్పి. మిత్రులను వూరించి. అవి బార్టర్ పద్ధతిలో యెలా లభిస్తాయో మార్గాలు చెపుతాడు. ముక్కుసెట్టి అంగట్లోని పదార్థాల కోసం యెప్పుడయినా రాళ్ళదొడ్డిలో పాలిష్ రాయిని దొంగిలించే పనికూడా క్రెంకడిపై మిత్రులు వేస్తుంటారు. క్రెంకడు వాళ్ళ దయాబద్ధుడు. ఆరోజు కొండిసెట్టి జీడీల రుచి చూపించాడు. మిత్రుల నోటి తీపు తీరక మరికొంచెం తెమ్మనేవేళకు కొండిసెట్టి. జట్టురాజు శంకరరెడ్డిని యేమీ అనలేక దేవిడ్ మీద తిరగబడ్డాడు:

"నీ కవసరమయితే దొంగగా పాలపొడి తెచ్చి మా అంగట్లో యిచ్చి కొనుక్కుంటావే! మాటి మాటికీ చిక్కేది నేనేనా? పాల పొడి తేపో. మనందరికీ కావలసిన జీడీలు పెట్టిస్తాను."

పాలపొడి మాట వినేవేళకు వెంకడి మనస్సు వూరింది. వాడు ఆతురతగా దేవిడ్ వైపు తిరిగి అడిగాడు:

"యేం పాలపొడి?"

"అదే! వాళ్ళ నాయనకు మూడెలకొద్దీ పాలపొడి వస్తాన్లా- గోధుమలూ. నూనే."

"మా నాయన యింట్లో వుంటాడు." డేవిడ్ గొణిగాడు.

"నేను చూశాన్లే. అంబళ్ళపొద్దున బస్సెక్కి పోతే. తేరా నీ యబ్బని గంటేమీ పోదు. మాటి మాటికి కొండిసెట్టేనా పాపం! పాలపొడి తేపో" శంకరరెడ్డి మందలించాడు.

వాడు సమితి ప్రెసిడెంటు కొడుకు. ఆయన పులి. పులిబిడ్డ పులిబిడ్డే. పులులు గొర్రెల్ని కనవు- గొర్రెల్ని తింటాయికాని. పిల్ల పులిరాజు ఆజ్ఞను డేవిడ్ పాటించక తప్పదు.

"సరేలే. వొరే వెంకట్ నువ్వు తోడు రారా"

డేవిడ్ వెంకన్ని తీసుకొని యేసుపురంవైపు నడిచాడు. యేసుపురమూ వూరికి వెలిగానే వున్నా, అరుంధతీయ వాడకు యెడదగా వుండి. దారిలో వెంకడు అడిగాడు:

"వోరే దావీదూ? ఆ పాలపొడి యేం చేస్తార్రా?"

"పాలు చేసుకుంటార్రా"

"అవి తాగితే బలం వస్తుందా? పాలపొడిపాలు బాగుంటాయా?"

"బ్రహ్మాండంగా వుంటాయి"

"నువ్వు రోజూ తాగుతావా?"

"వోఁ"

డేవిడ్ తన గొప్పకోసం ఆమాట అన్నాడు కానీ, వాడు పాలపొడి పాలు మాత్రమే తాగవలసిన అవసరంలేదు. వాళ్ళ నాన్న ఫాదర్‌జాన్ దొరల నోట్లోంచి వూడి పడ్డవాడు. యింట్లో దొరల పద్ధతే, దొరల బిడ్డలు యింటి బయట నిజం చెప్పరు.

"నే నెప్పుడూ పాలపొడి చూల్లేదు. పాలుతాగలేదు" వెంకడు నిట్టూర్చాడు. దేవిడ్ పలుకలేదు.

"దావీదూ! కొంచెం పాలపొడి నాకియ్యరా?" వెంకడు సందేహిస్తూ అడిగాడు.

"యెందుకు?"

"మా సెల్లెలూ, నేనూ తాగుతాంరా. మా సెల్లెలు కోసంరా. పాలు తాగితే జబ్బులు పోతాయి కదరా. మన తెలుగు పాఠంలో సెప్పినారు కదరా - పాలు పుష్టిని యిస్తాయని. కొంచెం సా(లా."

దేవిడ్ వెంకడి ముఖంలోకి చూసి వూరుకున్నాడు.

"నా బొంగరం యిస్తాలేరా, గోలుగుండ్లు యిస్తాలేరా, నెమలి యీకలు యిస్తాలేరా!"

దేవిడ్ బిగుసుకపోయాడు.

వెంకడి అహం బాగా దెబ్బతింది. దేవిడ్‌ను కింద పడవేసి తందామనుకున్నాడు. కానీ వెంకడి రక్తం అంత సులభంగా తిరగబడదు.

"సరే లేరా - నీ జత నా కెందుకు?"

దేవిడ్ మాటవరుసకు వెనక్కి పిలుస్తున్నా వినిపించుకోకుండా వెంకడు యింటివైపు చీకిచెట్ల మధ్యగా పరుగెత్తాడు. వాడి మనసు నిండా ఆపుకోలేని ఆక్రోశం వుంది. యింటి దగ్గర ఆ సమయంలో అమ్మ వుండదనే విషయం జ్ఞాపకానికి వచ్చి రాళ్ళదొడ్డివైపు మళ్లేడు. వేపచెట్టు కింద పక్కన్నే గోనెపట్టమీద పిల్లని పడుకోబెట్టి, రాళ్ళు

రుద్దుతున్న గంగి పైసా డబ్బులకోసం వస్తున్నాడనుకొని "సిల్లర్లే దురా" అంది.

"అక్కర్లేదులే."

"అడుకోను పోలేదా! పోనీ యీ దయ్యమ్మొండవన్నా అడిపించు. నా దుంప తెంచుతాంది. వొకటే యేడుపు. తిన్నా యేడుపే. తినకపోయినా యేడుపే. రాకాసి నోరు. సెరువు కడుపు."

చెల్లెలిని చంకలోకి తీసుకున్నాక వెంకడి క్షోభ యింకా యెక్కువయింది. వాడు బెరుకు బెరుగ్గా అమ్మను అడిగాడు.

"అమ్మా! పాలపొడి పాలు మంచియేనా?"

"కాదురా మంచియి కాదు."

నిజానికి గంగికి యే పాలపొడి గోలా తెలియదు. మంచివి అంటే కొడుకు యే గొడవ పెడతాడోనని అబద్ధం చెప్పింది.

"మంచియని పాదరీవాళ్ళ దావీదు చెప్పినాడే! పాదరీ యింట్లో పాలపొడి దండిగా వుంటుందట. అడిగి తీసుకోవే. వోబికి రోజూ పొయ్యొచ్చు. రోగం పోతుంది. పాదరీని అడగవే!"

"పాదరీ మనకియ్యడు. మనం మతంలో సేరలే. మనకియ్యడు." గంగి నిట్టూర్చింది. మతం పుచ్చుకున్న వాళ్ళకు కూడా పాలపొడి యెందరికో దక్కదని గంగికి తెలియదు. పైగా గంగి చెయ్యిచాచదు. యింటి దేవుడు తిరుపతి వెంకన్ని వదలదు. కొడుకు పేరు దేవుని పేరేనాయె!

"పాలు తాగితే పుష్టి కలుగుతుందే. మనం మతంలో సేరదామే-పాలపొడి దొరుకుతుందేమో"

''పనీ పాటాలేదు. వసపిట్ట వాగినట్లు వాగుతావు. పిల్ల నెత్తు కొని ఆడించరా అంటే యేందో పుట్టి పుట్టి అంటావు. వాళ్ళనీ వీళ్ళనీ సూసి అట్లా బతుకుదామంటావు. అంత పొద్దు పోకుంటే రెండు రాళ్ళురుద్దు. పావలా డబ్బులు వస్తాయి''

మాట జారినందుకు గంగి బాధపడిపోయింది. రాళ్ళ కష్టంలో కొడుకుని దించకూడదని గంగి బయటికి చెప్పుకోని శపథం. అమ్మ మాటలతో వెంకడికి ఆత్మజ్ఞానం కలిగింది!

"అవునే యీ సదువొద్దు. రోజూ పాలీషురాళ్లు రుద్ది వో బికి పాలూ పండ్లూ కొందాం."

గంగి మనసు గిలగిల లాడింది.

పసిపిల్లాడి కష్టంతో తినటమా? వాడు చదువుకొని చిన్న షద్యోగం చేసినా తమ కష్టాలు గట్టెక్కుతాయి. యీ రోజుల్లో తమ కులమోళ్ళకు మంచి వుద్యోగాలు వస్తాయంటున్నారు. వాడి బతుకు కంచు బండలపాలు కాకూడదు. వాళ్ళనాన్న యీ కంచురాళ్ళకే బలి అయ్యాడు. తన బ్రతుకు యీ కంచు రాళ్ళ మధ్యే తెల్లవారుతోంది. కొడుకు రాళ్ళమనిషి కాకూడదు.

గంగి వొక నిశ్చయానికి వచ్చింది. కొడుకును కేక వేసింది:

''నువ్వా నీ యెదవసోదీ కట్టిపెట్టు. నువ్వు సదువుకొని వుద్యోగం సేస్తే నాకదేసాలు. రాళ్ళు రుద్దా వద్దు. బండలకింద పడి సావా వద్దు. నువ్వు సదువొదిలితే నేను వురేసుకొని సస్తా. నోరు మూసుకొని కొంపకెళ్ళు. లేదా ఆడుకో - ఆ పిల్లనాడ పడేసి''

అమ్మ అంకమ్మ శివాలు చూసి వెంకడు అదిరిపోయాడు. నిజానికి వాడికి ఆ క్షణంలో యే పనిమీదా ధ్యాసలేదు. వాడికి యేదో కావాలి. వాడికి తినే తిండి సహించటంలేదు. కట్టే బట్ట సహించటం లేదు. వుండే కొంప సహించటం లేదు. "పుస్తకంలోని పుష్టి కర మైన ఆహారము" పాఠం వాడి తలకెక్కింది. పాఠంలోని బొమ్మలూ బొమ్మలోని వొక బొమ్మలాంటి వాడి చెల్లెలి ఆకారమూ వాన్ని బాధిస్తున్నాయి. ఆ బాధ తాత్కాలికంగా నివారణ కావాలన్నా వాడికి యిప్పుడు పాలపొడి కావాలి. డేవిడ్ దాన్ని యివ్వలేదు.

చెల్లెలిని మళ్ళీ పట్టమీద పడేసి గొణుక్కుంటూ చింతవనం వైపు అర్థరహితంగా వెంకడు నడిచాడు. పాలపొడిని కనీసం చూడాలని వాడికి మనసు పడింది. అయితే వనంలో శంకరరెడ్డి. కొండిసెట్టి. డేవిడ్ లు లేరు. వాడికి యేడుపు వచ్చింది. ఆ సమ యంలో అటువచ్చిన సీతారాముడు తారసపడ్డాడు. సీతారాముడు హను మంతు టీచరు కొడుకు. వెంకడి క్లాసే. సీతారాముడు వెంకడు వొం టరిగా కన్పించడం చూసి ఆశ్చర్య పడ్డాడు.

''యేందిరా యిక్కడున్నావు. నీ జతగాళ్ళేరి?''

''వాళ్లు మంచోళ్ళుకాదు. ఆ దావీదుగాని జత మానేసినా.''

"యేం?."

కారణం చెప్పడానికి వెంకడికి సిగ్గేసింది.

''చెప్పరా. వాళ్ళతో మనకేం. మనిద్దరం యిప్పట్నుంచి వొక జతగా వుందాం. ఆ శంకర్రెడ్డిగాడు తోడేలు. సెట్టిగాడు కోతి. దావీదుగాడు నక్కెదవ''

"నిజమేరా. ఆ దావీదుగాన్ని కొంచం, కొంచమంటే కొంచం పాలపొడి అడిగినా. నాకోసం కాదురా. మా చెల్లెలు వోబి వుండే దానికోసంరా. దానికి పాలు తాపితే జబ్బు పోతుంది. మనపాటంలో రాసినారు కదరా - పుష్టి కర మైన ఆ హా రం పాఠంలో. కానీ ఆ దావీదుగానికి నేనంటే లెక్కలేదు. శంకర్రెడ్డి అయితే లెక్కచేస్తాడు- ప్రెసిడెంటు కొడుకని. కొండిసెట్టి అన్నా దావీదుగానికిష్టమే-వాడికి అంగడి వుంది. నాకేముంది? నాజతంటే యెవరికి లెక్క? కొంచెం- కొంచమంటె కొంచెం పాలపొడి యివ్వరా అని బతిమాలితే యివ్వనే యివ్వలేదు. పోనీ డబ్బు సంపాయించి పాలపొడి కొందామంటే మా యమ్మ తిట్టింది. రాత్రి తిట్టింది. యిందాకా తిట్టింది."

క్షోభను ఆపుకోలేక వెంకడు వెక్కి వెక్కి యేడ్చాడు. సీతా రాముడు కరిగిపోయాడు.

"యేడవకురా. యేడవాకు. బోడి పాలపొడేనా. నేనిస్తాలే. విన్ననే మా నాయనకు ప్రెసిడెంటు రెండుమూటెల పాలపొడి యిచ్చి నాడంట. మా నాయన స్కూల్లో పెద్దటీచరుగదా అందుకని. శంకర్రెడ్డి నాయనదంతా మోసమంట! బడిపిల్లోళ్లకు పంచమని పాలపొడి మూటెలు దండిగా యిస్తే అవి అమ్ముకుంటాడంట! దావీదుగాని నాయనా అంతేనంట! మా నాయన మా అమ్మతో చెప్తాంటే విన్నా. మా యింట్లో పాలపొడి యిప్పిస్తాలే. నా జత వుండు. మా నాయనతో రాత్రిపూట ప్రయివేటుకూడా చెప్పిస్తా."

"అయితే మీ యింట్లోకూడా పాలపొడి వుందా?" వెంకడి ఆశ చిగిర్చింది.

"ఆఁ"

"మీ నాయన తంతాడేమోరా, ముందుగానే మీ నాయనకు కోపం జాస్తి. బళ్ళో లెక్కాలు తప్పితే సింతబరికెతో బాత్తాడు"

వెంకడికి టీచరు యమరూపం మనసులో మెదిలింది. సీతా రాముడికూడా వాళ్ళ నాన్నంటే చచ్చేంత భయం లేకపోలేదు. కానీ పిల్లల్లో స్వాభిమానం తక్కువేమీకాదు. సీతారాముడు నిర్లక్ష్యంగా అన్నాడు:

"పెద్దోళ్ళంతా అంతేరా. నేను పాలపొడి తెస్తాగా. మా నాయన యిప్పుడు యింట్లోలేడు. మాయమ్మ నేనడిగితే తప్పకుండా యిస్తుంది. కావాలంటే సూడు. మా అమ్మ మంచిదిరా. నాతోరా.."

యిద్దరూ సీతారాముడింటికి చేరుకున్నారు. సీతారాముడు వెంకన్ని బయట వుంచి లోపలికి వెళ్ళాడు. వెంకడు బిత్తర చూపులతో చుట్టూ కలయచూస్తున్నాడు. లోపలనుంచి సీతారాముడి తల్లి తిట్లు విన్పించాయి. వెంకడు భయంతో, నిస్పృహతో అక్కన్నుంచి జారు కోవాలనుకుంటుకున్న తరుణంలో టీచరు యముడు హనుమంతు రానే వచ్చాడు. వెంకడి నోట తడిలేదు. టీచరు మామూలుగానే అడిగినా వెంకడు వణికి పోయాడు:

"యేండిరా వెంకా! యిట్లా వచ్చినావు. మావాని కోసరమా. నువ్వు బాగా-చదువుకో. నీకు బాగానే చదువొస్తుంది. మాదిగిండ్లలో యితర పిల్లకాయల మాదిరి తిరిగి చెడిపోవద్దు"

సీతారాముడి తల్లి కొడుకును యీడ్చుకుంటూ, తిట్టుకుంటూ బయటికి వచ్చింది. మొగుణ్ని చూస్తూనే గొంతు పెంచింది:

"చూడు! వీడూ వీడి దరిద్రగొట్టు స్నేహాలూ. వాని మొగానికి పాలపొడి కావాలంట! వీడు పంచుతాడంట! చెల్లెలికి పాలు వాడు తాపాలంట! వీడు పాలపొడి యివ్వాలంట! యింట్లో కర్ణుడు పుట్టినాడు. సంసారం ముండ మొయ్యాల్సిందే."

స్కూల్లో యముడిది జాలిగుండె. పరిస్థితి అర్థమయింది. తంటాలుపడి సీతారామున్ని తల్లి చెరనుండి విడిపించి వెంకడితోఅన్నాడు:

"వుండ్రా. పాలపొడి కావాలా! తెచ్చిస్తా వుండు."

హనుమంతు యింట్లోకివెళ్ళి వొక పొట్లం తెచ్చి, వెంకడి చేతిలోవుంచి అన్నాడు;

"వొరే వెంకా! నువ్వు మంచోడివి. నాకు తెలుసు. యీ పాలపొడి యిచ్చినట్లు యెక్కడన్నా కూసేవు. మీ అమ్మకి మాత్రం నేనిచ్చానని చెప్పు. లేకపోతే దొంగసొమ్మని యెముకలు విరుస్తుంది. నువ్వు యింటికి పద. మావాడు తర్వాత ఆడుకోటానికి వస్తాడు."

వెంకడు బెదురుగా తలవూపి, కృతజ్ఞత జాలువారే కళ్ళతో పాలపొడి పొట్లాన్ని మాసిన చింకి చొక్కా కింద పెట్టుకొని ముందుకు నడిచాడు. కొంత దూరం పోయాక వాడికి సీతారాముడి యేడుపు వినిపించింది. అయితే సీతారాముడి యేడుపుకు కారణాలు ఆలోచించే స్థితిలో వెంకడు లేడు. వాడు ఆనంద శిఖరాల మీదున్నాడు. పాలపొడితో పుష్టికరమైన ఆహారం లభించినట్లూ, ఆరోగ్యం కలిగినట్లూ వాడు తృప్తి పడ్డాడు

గంగి మొత్తుకున్నా వినకుండా మారాంచేసి పాలపొడి పాలు చెల్లెలు వోబికి రెండు మూడు గ్లాసుల పాలు పట్టించాడు. అది పాలక రాజకీయ కబంధుల్లా చేతులూ, నోరూ చాచిందే కానీ వద్దనలేదు. వెంకడు సంబర పడిపోయాడు. వాడూ గ్లాసెడు పాలు తాగి తృప్తి పడ్డాడు. కొంత పొడి దాచి. ఆనందంలో గంతులు వేశాడు.

రోజు తిరక్కుండానే వోబికీ వెంకనికీ వాంతులూ, విరేచనాలూ తెగ కావడం చూసి, గంగి గుండె బేజారయింది. తెలిసిన వైద్యాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఆ పాయంత్రానికి వోబి పరిస్థితి పూర్తిగా దిగజారి పోయింది. యెగశ్వాసతో వోబి కొట్టుకలాడుతోంది. పిచ్చి పిచ్చిగా వెంకడు కలవరిస్తున్నాడు.

"పుష్టికరమైన ఆహారం.... మంచి పోషణ. వోబి జబ్బు పోతుంది. దావీదుగాడు దొంగ. సీతారాముడు నా జత. అనుమంతు అయ్యవారు దేముడు. పుష్టికరమైన ఆహారము వోబికి శక్తి .. పుష్టి ... రక్షణ ..."

కొట్టంలో ఆ రాత్రి గుడ్డి దీపంపక్కన వోదార్చే వాళ్ళ మధ్య తల్లి పేగును వెయ్యి రంపాలతో కోసి యమయాతన పెడుతున్న పిల్లల దీనస్థితిచూసి గంగి నెత్తీ నోరూ బాదుకుంది. రక్షించమని గంగి వేడని దేవుడూ లేడు, దేవతాలేదు. కానీ నమ్మినయింటిదైవం తిరుపతి వెంకన్న దిగిరాలేదు. కులదేవత అరుంధతి కదలిరాలేదు. యే మహిమా యెవరూ చూపలేదు. దేవుళ్ళు తమ నిజమైన భక్తులుచెప్పే కథల్లోనే మహిమలు చూపుతారని గంగికేం తెలుసు? గంగి గుండె లవిసేటట్లు యేడుస్తూనే వుంది.

కొట్టం బయట వెన్నెల. తడిసిన పాలపొడిలా ముద్దగట్టిన వెన్నెల. కల్తీ పాలపొడిలా మచ్చల నెలరాజు వెన్నెల. వూరు మీద వూరు వెలివేసిన అరుంధతీయ వాడమీద. వాడలోని గంగి కొట్టం మీదా వెన్నెలే.

కొట్టంలో మాత్రం నువ్వూ నేనూ శిలువ వేసిన మనుషులనీడలు.

"ఆంధ్ర జ్యోతి" 20 యేప్రిల్ 1973.